కాఫీ తోట దగ్ధం

ప్రజాశక్తి -అనంతగిరి:చేతికి అందించిన అంది వచ్చిన కాఫీ తోటలు దగ్ధం కావడంతో రైతులు లబోదిబోమన్నారు. మండలంలోని వేగడం పంచాయతీ పరిధి డొంకపుట్టు గ్రామానికి చెందిన సఫీ గంగన్న, , గాసాన్నకు చెందిన రెండు ఎకరాల కాఫీ తోటలు శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిపుంటిచడంతో పూర్తిగా కాలి బూడిద అయ్యాయి గమనించిన రైతులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలించలేదు. తోటలు కాలి పోవడంతో ఆర్థికంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక సహాయం అందించాలని రైతులు కోరారు.

దగ్ధమైన కాఫీ తోట

వెలుగులో అవినీతిపై సభ్యుల నిలదీత

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ బి.ఈశ్వరి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెలుగు శాఖలో జరిగిన అవినీతిపై సభ్యులు వెలుగు ఏపీఎంను నిలదీశారు. గసభ పంచాయతీ అడ్రగుడ, లోగిలి, మొర్రిగూడ, జంగిడివలస గ్రామాల్లోని డ్వాక్రా సభ్యులకు పొదుపు చెల్లించిన డబ్బులను సీసీలు జమ చేయకుండా కాజేసారని ఆ పంచాయతీ సిపిఎం సర్పంచ్ పి సునీత నిలదీశారు. గసభ పంచాయితీలో నాడు నేడు రెండవ పేజ్ ద్వారా మంజూరైన జంగిడివలస, గొంధివలస, సిమిలిగూడ పాఠశాలల భవనాలు అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారని ఎంఈఓను సర్పంచ్ సునీత ప్రశ్నించారు. తక్షణమే పనులు పూర్తి చేయాలని, లేని పక్షంలో వచ్చే సర్వసభ్య సమావేశంలో మళ్లీ నిలదీయాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. డ్వాక్రా సభ్యులు చెల్లించిన డబ్బులకు స్లిప్పులు కూడా వెలుగు సిబ్బంది ఇవ్వడం లేదంటూ లైగండ, ఖండ్రుం పంచాయతీ సర్పంచులు కె హరి, ఎంపిటిసి నిలదీశారు. అరకులోని అంగన్వాడి కేంద్రంలో గత మూడు నెలల నుంచి పౌష్టికాహారం అందించడం లేదని సర్పంచ్ శారద నిలదీశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఐసిడిఎస్, వైద్య శాఖ మెడికల్ క్యాంపుల్లో, ఇతర శాఖలు చేపడుతున్న అభివద్ధి పనుల్లో స్థానిక ప్రజాప్రతినిధులకు భాగస్వామ్యం చేయాలని గత సమావేశంలో చర్చించిన ఎందుకు భాగస్వామ్యం చేయడం లేదంటూ సభ్యులు ముక్తకంఠంతో అధికారులను నిలదీశారు. ఇకనుంచి అయినా పనితీరు మార్చుకుని స్థానిక ప్రజాప్రతినిధులకు భాగస్వామ్యం చేసుకుని ముందుకు వెళ్లాలని వారు అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సిహెచ్ జానకమ్మ,ఎంపీడీవో ప్రేమ్ సాగర్, వైస్ ఎంపీపీలు ఎస్ ఆనంద్, పి లలిత, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిలదీస్తున్న సిపిఎం సర్పంచ్ సునీత, అరకు సర్పంచ్ శారద

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి సంతోష్‌కుమార్

26న చలో ఐటిడిఎను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని ములకనపల్లి, కుందులూరు గ్రామపంచాయతీల్లో సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న చింతూరు ఐటిడిఎ ఎదుట జరుగు ధర్నాకు ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు, మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆయా గ్రామాలను శనివారం సందర్శించిన సిపిఎం నాయకులు స్థానికుల నుండి సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నర్సింగ్‌పేట నుండి కుందులూరు మీదుగా పెదమట్టపల్లి వెళ్లే ప్రధాన రహదారిని గతంలో తవ్వి వదిలిపెట్టారని తెలిపారు. కారంగూడెం బిటి రోడ్డు జంక్షన్ నుండి ముల్కనపల్లి మీదుగా కోడేరు వెళ్లే బిటి రోడ్డు మొత్తం పాడైపోయిందన్నారు. ఈ రెండు రోడ్ల నిర్మాణం చేయాలని కోరారు. వీటిపై ఇతర సమస్యల పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, మండల కమిటీ సభ్యులు పంకు సత్తిబాబు, పోడియం శ్రీరామ్మూర్తి, కమ్మసిచ్చు సత్యనారాయణ, గుండుపూడి లక్ష్మణరావు, స్థానిక సర్పంచ్ సవలం మారయ్య, గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నాం

- సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో వెల్లువెత్తుతున్న సమస్యలు

ముంచంగిపుట్టులో చేపడుతున్న ప్రజా చైతన్య యాత్ర

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: వనగుమ్మ పంచాయితీలోనీ కిరంబో, వనగుమ్మ గ్రామలలో సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజా చైతన్య యాత్రను మండల కమిటీ సభ్యులు కొర్ర శంకర్‌రావు, భీమన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ, కిరంబో గ్రామంలో 45 పివిటిజి కుటుంబాలు ఉన్నప్పటికీ కనీసం రోడ్డు సౌకర్యం లేక అత్యవసర వైద్య సేవలకు అవస్థలు పడుతున్నారన్నారు. గర్భిణి, బాలింతలను ఆసుపత్రికి తరలించేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. 2024లో స్పందనలో ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును నిర్మించాలని కోరారు.

జి.మాడుగుల: సిపిఎం తలపెట్టిన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మండలంలోని గేమ్మెలి పంచాయతీ చీమలపాడు గ్రామంలో సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి సాగిన ధర్మన్న పడాల్, పీసా కమిటీ సెక్రటరీ గబ్బడి ఈశ్వరరావు మాట్లాడుతూ, సీమలపాడు గ్రామంలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో చాలా బాధపడుతున్నారన్నారు. రోడ్డు లేక ఎవరికైనా ఆరోగ్యం బాగోలేకపోతే డోలీమోతలతో కులపాడు సెంటర్ వరకు తీసుకు రావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గతంలో జలజీవన్ మిషన్‌లో భాగంగా పైపులు వేసి వదిలి వేశారని తెలిపారు. చెక్ డ్యామ్ మరమ్మతుతో పంట పొలాలకు నీరు అందక బీడుభూములుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉల్లి.పెద్దబాయి, వార్డు మెంబర్ తిరుపతమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు

పివిటిజి గ్రామాలపై నిర్లక్ష్యం

పాడేరు:పీవీటిజి గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనపై అశ్రద్ధ తగదని సిపిఎం నేతలు తెలిపారు. వనుగుపల్లి పంచాయతీ ఒతగున్నలు గ్రామంలో జన్మన్ గృహలకు 10 లక్షలు పెంచాలని, డ్రైనేజీ, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శనివారం పాడేరు మండలం వనుగుపల్లి పంచాయతీ చింతగున్నలు గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎల్.సుందరరావు మాట్లాడుతూ, చింతగున్నలు గ్రామంలో డ్రైనేజీ, సీసీ రోడ్లు, సాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అర్హులైన గిరిజనందరికీ కొండపోడు పట్టాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కొర్ర. ప్రసాద్, పార్టీ సభ్యులు రమేష్, జోగులు, బాలు, గణేష్, అప్పన్న పాల్గొన్నారు.

పాడేరులో నినాదాలు చేస్తున్న సిపిఎం నేతలు

అనంతగిరిలో నినాదాలు చేస్తున్న సిపిఎం నేతలు

అనంతగిరి:మండలంలోని వేంగడ పంచాయతీ పరిధి బందవలస, మండ్రువలస, గోమంగిపాడులో సమస్యలు తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని సిపిఎం మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు డిమాండ్ చేశారు . సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శనివారం పార్టీ కార్యకర్తలతో గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్లు, తాగునీరు, హౌసింగ్ వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. వేంగడ మెయిన్ రోడ్డు నుండి గోమ్మగింపాడు, మండ్రువలస రోడ్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు ఎం. రామన్న, అప్పన్న, వార్డు మెంబర్ సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

మెగా వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని యు.చీడిపాలెం పంచాయితీ పరిధి పలకజీడి గ్రామంలో పోలీసు శాఖ ఆధ్వర్యాన శుక్రవారం మెగా వాల్ బాల్ టోర్నమెంట్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ అమిత్ బార్దర్ ఆదేశాల మేరకు, రంపచోడవరం డిఎస్పి సాయి ప్రశాంత్ పర్యవేక్షణలో అడ్డతీగల సిఐ బి.నరసింహమూర్తి, కొయ్యూరు సీఐ పి.వెంకట రమణ, వై.రామవరం ఎస్ఐ బి.రామకృష్ణ, మంప ఎస్సై కె.శంకర్ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ జరిగింది. మంప పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు, వై.రామవరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువతకు నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో 30 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా 800 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గిరిజనులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి, ప్రజలందరికీ ఉచితంగా వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా రంపచోడవరం డిఎస్పీ సాయి ప్రశాంత్ మాట్లాడుతూ గిరిజన ప్రాంత యువకులు క్రీడలలో రాణించే విధంగా పోలీస్ శాఖ తరపున తగిన సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం విజేతలకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రాధ, పిఎస్ఐలు చక్రధర, సత్యం సురేష్, మహతి, గౌరీశ్వరి, చందన, లోకేశ్వరి, డాక్టర్లు హేమంత్ చౌదరి, రేణుక, యు చీడపాలెం సర్పంచ్ దడాల రమేష్ బాబు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్న 30 జట్లుకు వాలీబాల్ కిట్లు అందజేశారు.

నిరసన చేపడుతున్న కెప్టెన్లు

కనీస వేతనాలు అమలు చేయాలి

- తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్ల నిరసన

ప్రజాశక్తి-పాడేరు: కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ జిల్లా సర్వజన ఆసుపత్రి వద్ద తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ కెప్టెన్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందర రావు మాట్లాడుతూ, ఈనెల 31తో ముగుస్తున్న తల్లి బిడ్డ ఎక్స్ప్రెస్ టెండర్ ను కొనసాగించాలన్నారు. కేవలం రూ.7,870 రూపాయల జీతాలతో కెప్టెన్లు పని చేస్తున్నారన్నారు. అరకొర జీతాలతో కుటుంబాలను పోషించుకోలేని దీనస్థితిలో ఉన్నారన్నారు. కనీస వేతనం 18600 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అప్పులు చేసి కుటుంబాలు నడిపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే అల్లూరి జిల్లాలో పని చేస్తున్న వారందరితో కలిసి ఆందోళన చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు దామోదరం, కొండ బాబు , సింహచలం, గణపతి, మహేష్ పాల్గొన్నారు.

ర్యాలీ చేపడుతున్న వైద్య సిబ్బంది

క్షయ వ్యాధిపై ర్యాలీ

ప్రజాశక్తి-చింతపల్లి: క్షయ వ్యాధి పట్ల రోగులు భయం వీడి, ధైర్యంగా మందులు వాడాలని కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లకే శివప్రసాద్ సూచించారు. ప్రపంచ క్షయ వ్యాధిని పురస్కరించుకొని శనివారం టిబి సూపర్వైజర్ ప్రసాద్ ఆధ్వర్యంలో కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి వై జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి వైద్యాధికారి మాట్లాడుతూ, అప్పుడే జన్మించిన శిశువులకు బిసిజి టీకాలు వేయించాలన్నారు. క్షయ వ్యాధి సోకిన వారికి పూర్తిస్థాయిలో మందులు వాడటంతో ఈ వ్యాధి వ్యాప్తి చెందకుండా నివారించవచ్చునన్నారు. వైద్యాధికారులు సూచించిన మందులన్నీ క్రమం తప్పకుండా వాడాలన్నారు.క్షయ రోగి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు నోటకి రుమాలు అడ్డు పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్స్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అంధకారంలో ఆర్టీసీ కాంప్లెక్స్

విద్యుత్ బిల్లు చెల్లించకపోవడంతో సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-రంపచోడవరం

స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో రెండు రోజులుగా విద్యుత్ సరఫరా లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. నియోజకవర్గ కేంద్రం కావడంతో నిత్యం వివిధ పనుల నిమిత్తం పలువురు రంపచోడవరం రాకపోకలు సాగిస్తుంటారు. పనులు ముగించుకొని ఎక్కువ శాతం సాయంత్రం సమయంలో వారు తిరుగు పయనమవుతారు. ముఖ్యంగా చింతూరు డివిజన్‌లోని విలీన మండలాలకు వెళ్లే ప్రయాణికులు బస్సు సర్వీసులు సాయంత్రం సమయంలో ఉండటంతో వారు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు వచ్చే వరకు వేచి ఉంటారు. అయితే రెండు రోజులుగా ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రయాణికులు మహిళలు, వృద్ధులు కాంప్లెక్స్‌లో కూర్చోడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ బిల్లు బకాయి ఉండడంతో సంబంధిత అధికారులు సర్వీస్‌ను తొలగించారు. గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గోకవరం డిపో పరిధిలో ఉన్నప్పుడు ఇటువంటి సమస్యలు ఎప్పుడు తలెత్తలేదని, జిల్లాలు విభజనలో భాగంగా పాడేరు జిల్లాలో విలీనమైన తర్వాత ఇటువంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పలువురు అంటున్నారు. గతంలో సుమారు మూడు నెలలపాటు మోటారు మరమ్మతులకు గురి కావడంతో పాడేరు డిపో అధికారులకు విషయం తెలియజేస్తే మూడు నెలల తర్వాత మరమ్మతులు చేయించారని, ఇటువంటి సంఘటనలు తరచూ ఎదురవుతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు.



విద్యుత్ సరఫరా లేకపోవడంతో చీకటిగా ఉన్న రంపచోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్

విద్యుత్‌శాఖ ఎఇ వివరణ

విద్యుత్ సరఫరా నిలిపివేతపై విద్యుత్ శాఖ ఏఈ సిహెచ్.శ్రీనివాస్‌ను వివరణ కోరగా రంపచోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సంబంధించి సుమారు రూ.36 వేలు విద్యుత్ బిల్లుల బకాయిలు ఉందని తెలిపారు. ఈ బకాయి చెల్లించాలని పాడేరు ఆర్టీసీ అధికారులకు తెలియజేశామని, వారు చెల్లించకపోవడంతో సర్వీసును తొలగించడం జరిగిందని చెప్పారు.

గురుకులంలో ప్రవేశ దరఖాస్తుకు తుది గడువు 25

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం సీలేరు ఏపీ గురుకుల పాఠశాలలో 2025 - 26 సంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశానికి ఈనెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ బుచ్చిబాబు తెలిపారు. స్థానిక విలేకరులతో శనివారం అయన మాట్లాడుతూ నాలుగో తరగతి పూర్తి చేసుకుని 2025- 26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి ప్రవేశానికి 80 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు విద్యార్థి, వారి తల్లిదండ్రులు ఆధార్ కార్డులు, విద్యార్థి ఫోటో, ఫోన్ నెంబరు, కుల ధ్రువీకరణ పత్రం, చదువుకున్న పాఠశాల వివరాలు తప్పనిసరిగా తీసుకురావాలని పేర్కొన్నారు. ఎవరికైనా ఎటువంటి సందేహాలుంటే 9440960780 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని ఆయన సూచించారు.

తాగునీటి కుళాయిలు ప్రారంభం

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని మారుమూల పంచాయతీ బూదరాళ్ల పరిధిలోని ఐదు గ్రామాల్లో విశాఖ జిల్లా నవనిర్మాణ సమితి (నర్సీపట్నం) ఆధ్వర్యంలో తాగునీటి పథకాలను ఏర్పాటు చేశారు. బొడ్డుమామిడి, పోకలపాలెం, అన్నవరం, గొర్రెలమెట్ట, దొడవగొయ్యిలి తదితర గ్రామాల్లో రక్షిత మంచి నీటి ట్యాంక్‌లను, కుళాయిలను స్థానిక సర్పంచ్, సాగిన ముత్యాలమ్మ, సంస్థ ప్రతినిధులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకొని పంచాయితీ పరిధిలో అన్నీ గ్రామాలకు మంచినీటి సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజర్ ఎం.వీరనాయుడు, కో-ఆర్డినేటర్ డి.నాగేశ్వరరావు, జూనియర్ ఇంజనీర్ కె.బుజ్జి, వంతల నారాయణ, వార్డు సభ్యులు సంజీవ్, కూటమి నాయకులు కొర్ర కొండబాబు, వైసీపీ నాయకులు కొర్ర తిరుపతి, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కుళాయిలను ప్రారంభిస్తున్న సర్పంచ్ ముత్యాలమ్మ, వార్డు మెంబర్ సంజీవ్

ముగిసిన అంగన్వాడీల శిక్షణ

శిక్షణలో పాల్గొన్న అంగన్వాడీలతో సిడిపిఒ లక్ష్మీదేవి తదితరులు

ప్రజాశక్తి-సీలేరు

అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు నిర్వహించిన పోషణ్ భీ, పడాయి భీ శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. మూడో రోజు ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీదేవి మాట్లాడుతూ మొదటిరోజు బాల్యారంబ సంరక్షణ, విద్య, పిల్లల సమగ్ర అభివృద్ధిపైనా రెండో రోజు పౌష్టికాహారం ప్రాముఖ్యత స్థూల సూక్ష్మ పౌష్టికాహార లోపం గురించి, ఎస్ఏఎం ఎంఏఎన్ పిల్లల గుర్తింపు నివారణ, నిర్వహణపైనా, మూడోరోజు వికలాంగ పిల్లల స్క్రీనింగ్, వారి రిఫెరెన్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ డి వలసమ్మ, కే రామలక్ష్మి, డి మోహిని, కే కృష్ణకుమారి పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందజేయడం జరుగుతుందని స్థానిక తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు, స్థానిక సిడిపిఒ దేవామణి అన్నారు. రాజవొమ్మంగిలో అంగన్వాడి వర్కర్ల శిక్షణ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు, అంగన్వాడి వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ సిడిపిఒ దేవమణి

ఫామ్ పాండ్స్‌తో గిరిజన రైతులకు మేలు

పలు గ్రామాల్లో పనులు ప్రారంభం

పాడేరులో పనులను ప్రారంభిస్తున్న గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: నీటి కుంటలు తవ్వకంతో గిరిజన రైతులకు ఎంతో మేలని పాడేరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శనివారం పాడేరు మండలం ఇరడాపల్లి పంచాయితీ రాయిగెడ్డ గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా నీటి కుంటల(ఫామ్ పాండ్స్) తవ్వకాల పనులను ఆమె ప్రారంభించారు. ఎన్ఆర్ జిఎస్ లో తీసుకొచ్చిన నీటి కుంటల తవ్వకంతో ఆదివాసి రైతులకు ఎంతో ఉపయోగకరమన్నారు. వర్షాలు కురిసినప్పుడు నీటి కుంటలను నింపుకుంటే సాగుకు అవసరమైనప్పుడు ఆ కుంటల్లో నీటిని వినియోగించుకుని వ్యవసాయ ఉత్పత్తులను పెంచుకునే అవకాశం ఉందన్నారు. ప్రతి రైతు నీటి కుంటల తవ్వకాలను సద్వినియోగం చేసుకోవాలని, రైతులు తమకున్న భూముల్లో 10శాతం నుంచి 25శాతం వరకు భూమిని నీటి కుంటల కోసం కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షులు డప్పొడి వెంకటరమణ, ఎంపిపి సొనారి రత్నకుమారి, సర్పంచ్‌లు శ్రీజ, పార్వతమ్మ, మాజీ ఎంపిపి ఎస్‌వి రమణమూర్తి, మాజీ ఎంపిటిసి రాంబాబు, మాజీ సర్పంచ్ కొండబాబు, ఎన్ఆర్ జిఎస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు .

రాజవొమ్మంగి మండలంలో...

పెదబయలు: ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని అరడకోట గ్రామ పంచాయతీ పాలవలసలో ఫారం పండు ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొర్రా రాజబాబు, ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య, ఏపీఓ ఎస్ పెదప్పల నాయుడు, టిపి రాజబాబు, విఆర్పి బాలన్న పాల్గొన్నారు.

రంపచోడవరం : ఏజెన్సీలోని ఏడు మండలాల్లో సుమారు 3వేల ఫారం పాండ్స్ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేయడం జరిగిందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. శనివారం మండలంలోని రంప పంచాయతీ పరిధిలో పందిరి మామిడి గ్రామంలో ప్రపంచ జల దినోత్సవం పురస్కరించుకొని ఫారం పాండ్లు ప్రారంభోత్సవానికి ప్రాజెక్ట్ అధికారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ఏడు మండలాల్లో ప్రతి గ్రామ పంచాయతీకి 25 ఫారం పాండ్లు ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బంధం శ్రీదేవి, జడ్పిటిసి సభ్యురాలు పండ వెంకటలక్ష్మి, రంప పంచాయతీ సర్పంచ్ చెదల వెంకటలక్ష్మి, ఎంపీడీవో యస్.శ్రీనివాసరావు దొర, ఉపాధి హామీ ఏపీవో బి.సత్యనారాయణ, వాకా వీరన్న, స్థానిక నాయకులు అడబాల బాపిరాజు, చవలం బాపిరాజు, పి.అనంత మోహన్, పండ చల్లన్నదొర, పోలోజు సురేష్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : భూగర్భ జలాలు పెంచేందుకు అందరి కృషి అవసరమని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జడ్పిటిసి ఒడుగుల జ్యోతి అన్నారు. మండలంలోని సూరంపాలెం కిర్రాబు లాగరాయి తదితర గ్రామాల్లో ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా రైతు పొలాల్లో ఫారం పాండ్స్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. మండలంలోని ఉపాధి హామీ పథకం ద్వారా 15 ఫారం పాండ్స్ నిర్మాణ పనులు చేవడుతున్నట్లు ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు, ఏపీఎం రెడ్డిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్బర్తి ఎంపిటీసీ గొల్లపూడి పెద్దిరాజు, అయా గ్రామ సర్పంచ్‌లు, ఎంపిటీసీలు పాల్గొన్నారు.

కొయ్యూరు మండలం డౌనూరులో...

కొయ్యూరు : మండలం డౌనూరులో రైతు పోలోజీ చిట్టమ్మ భూమిలో ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఎన్ఆర్ఇజిఎస్ చట్టం ద్వారా ఫారం పాండ్ నిర్మాణ పనులను డౌనూర సర్పంచ్, పోట్టిక బావని డౌనూరు సింగ్మెంట్ ఎంపిటిసి బిడిజన అప్పారావు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి, విఆర్పీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రంపచోడవరం మండలం రంప పంచాయతీలో...

ఉపాధి హామీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని సూకూరు పంచాయతీలో శనివారం స్థానిక సర్పంచ్ సత్యవతి, ఎం జిఎన్ఆర్‌జిఎస్ ఏపీఓ లింగమూర్తిలు ఉపాధి హామీ పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పనులను రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. ప్రతీ ఒక్క లబ్ధిదారుడు పూర్తి పని దినాలను వినియోగించేకోవాలని కోరారు. వడదెబ్బ తగలకుండా టార్పాలిన్లు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురళి, వీఆర్పీలు ప్రవీణ్, శ్యామల పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ సత్యవతి

పరిశీలిస్తున్న సిబ్బంది

ఆధార్ కేంద్రాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-చింతపల్లి: ఆధార్ కేంద్రాన్ని వినియోగించు కోవాలని మండల కేంద్రంలోని చింతపల్లి-3 సచివాలయ కేంద్రం వీఆర్వో చల్లంగి విష్ణు, డిజిటల్ అసిస్టెంట్ బెరా సింహాచలం తెలిపారు. ఈ సందర్భంగా వారు శనివారం మాట్లాడుతూ, ఆధార్ కార్డులో అక్షర దోషాలను సరి చేస్తామన్నారు. ఎంపీడీవో ఆదేశాల మేరకు ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆధార్ కార్డులలోని తప్పొప్పులను ,మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం ఉందన్నారు.ఈ ఆధార్ కేంద్రం మరో వారం రోజులు పాటు చింతపల్లి-3 సచివాలయం కేంద్రంలో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆధార్ నిర్వాహకడు సుభాష్ ఉన్నారు.

ఆశీలు వేలం పాట

ప్రజాశక్తి-చింతపల్లి: లోతుగడ్డ జంక్షన్ వారపు సంత ఆశీల పాటను గేమ్మెలి కృష్ణ కైవశం చేసుకున్నాడని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. పంచాయతీ సర్పంచ్ సమిడి గోపాల్, కార్యదర్శి లక్ష్మి కుమారి ల సమక్షంలో నిర్వహించిన ఆశీల పాట ఇరువురు పోటీ పడ్డారు. గేమ్మెలి కృష్ణ రూ.1,00500 లకు పాటను కైవసం చేసుకున్నాడు. దీంతో ఎంపీడీవో శ్రీనివాసరావు, సర్పంచ్ గోపాల్, కార్యదర్శి లక్ష్మి కుమారి చేతుల మీదుగా కృష్ణకు ఆశీల పాట ధ్రువపత్రం అందజేశారు.

ఆశీలు పాట ధ్రువపత్రాన్ని ఇస్తున్న ఎంపిడిఓ

నేరాలు ఘోరాలు

వేర్వేరు చోట్ల

110 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి ఏపీ ఆర్ స్కూల్ వద్ద శనివారం ఆటోలో తరలిస్తున్న 100 కేజీల గంజాయిని పట్టుకున్నామని డీఎస్పీ పీ.శ్రీనివాసరావు తెలిపారు. ట్రైనీ డీఎస్పీ చైతన్య ఆధ్వర్యంలో ఎస్సై రమేష్ వాహన తనిఖీలు చేస్తుండగా కృష్ణదేవిపేట నుంచి తాళ్లపాలెం వెళుతున్న ఆటోను తనిఖీ చేయగా నాలుగు బ్యాగుల్లో 100 కేజీల గంజాయి లభ్యమైందన్నారు. ఇద్దరు వ్యక్తులు పరారీ కాగా చింతపల్లి మండలం కోరుకొండకు చెందిన మజ్జి గాంధీ, వంతల హరిబాబు, నర్సీపట్నంకు చెందిన గుడాల పార్థకిర్తిలు పట్టుబడ్డారన్నారు. ఆటో సీజ్ చేసి మూడు సెల్ ఫోన్లు స్వాదీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ గోవిందరావు, ట్రైనీ డీఎస్పీ చైతన్య పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో 10 కిలోల గంజాయిని రైల్వే పోలీసులు పట్టుకున్నారు. చెన్నయ్‌కు చెందిన ముహమ్మద్ అబ్బాస్, బిరేంద్ర రానా విశాఖపట్నం రైల్వే స్టేషన్ మీదుగా తమిళనాడుకు ఈ సరుకును తరలిస్తున్నారు. వారిరువురినీ పోలీసులు అరెస్టు చేశారు. కేసును జిఆర్‌పి ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనంజయనాయుడు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి వాహనం బోల్తా

ప్రజాశక్తి- దుంబ్రిగుడ: మైదాన ప్రాంతానికి గుట్టుచప్పుడు కాకుండా గంజాయితో వెళ్తున్న ఇన్నోవా వాహనం అరుకు సమీపంలోని జాతీయ రహదారికి ఆనుకుని అరకు-పాడేరు ప్రధాన రహదారిలో శనివారం బోల్తా పడింది. స్థానిక పోలీసుల వివరాల ప్రకారం స్థానికుల సమాచారంతో సంఘటన స్థలంలో పోలీసులు చేరుకున్నారు. పొక్లెయిన్ తో వాహన అద్దాలను పగలగొట్టారు. వాహహనంలో గంజాయి బయట పడింది. ఇన్నోవాలో ప్రయాణిస్తున్న నిందితులు సంఘటన స్థలం నుంచి పరారయ్యారు. వాహనాన్ని పోలీసు స్టేషన్కు తరలించి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి 280 కేజీలు ఉంటుందని స్థానిక స్టేషన్ రైటర్ ధర్మేంద్ర తెలిపారు.

దుకాణం దగ్ధం

ప్రజాశక్తి -మధురవాడ : గణేష్‌నగర్‌లోని రాజేశ్వరి కిరాణా జనరల్ స్టోర్స్‌లో శనివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవించింది. షాపులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో చుట్టు పక్కల ప్రజలు భయాందోళన చెందారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. షార్ట్ సర్క్యూట్ వల్లనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. సుమారు రూ.20 లక్షలు వరకు ఆస్తి నష్టం జరిగిందని షాపు యజమాని కందుల శ్రీధర్ తెలిపారు. విషయం తెలిసిన వెంటనే రాష్ట్ర కళింగ వైశ్య మాజీ బీసీ కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు తదితరులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. పిఎంపాలెం పోలీసులు సంఘటనపై ఆరా తీశారు.

మట్టి అక్రమ తవ్వకాలపై కేసు

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని పాండ్రంగి గ్రామంలోని వెంగమాంబ క్వారీ దగ్గరలో, కురపల్లి గ్రామంలో అక్రమంగా మట్టిని తవ్వుతున్న జెసిబి, ఒక లారీని శుక్రవారం రాత్రి పద్మనాభం సిఐ శ్రీధర్ ఆదేశాల మేరకు బీట్ సిబ్బంది పట్టుకున్నారు. తగు చర్య నిమిత్తం తహశీల్దార్ కె.ఆనందరావుకు సమాచారం అందించినట్లు సిఐ తెలిపారు.

గృహాల బిల్లులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : మండల కేంద్రంలో సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ మండల కార్యదర్శి కొర్ర త్రినాథ్ ఆధ్వర్యంలో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం త్రినాథ్ మాట్లాడుతూ, పీఎంఏవై పథకంలో భాగంగా అర్హులైన వారందరికీ పది లక్షల నిధులు కేటాయించి గృహాల నిర్మాణానికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. ఏప్రిల్ మొదటి వారంలో పనులు ప్రారంభమయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పివిటిసిలకు పీఎం జన్మన్ పథకం కింద ప్రత్యేక నిధులు కేటాయించి రెండోవ విడత బిల్లులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు వి.లైకొన్, ఎంఎం శ్రీను, కె.నర్సయ్య, పి.రామదాసు, కె.శంకర్రావు, కె.శ్రీను, జి.నారాయణ, జి.జిన బందు, దేవన్న పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలి డబ్బులు జమ చేయాలి

ప్రజాశక్తి - సీలేరు : ఉపాధి హామీ కూలీ పనులు చేసిన వారికి డబ్బులు వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని జీకే వీధి మండలం ఏ దారకొండ ఉపసర్పంచ్ మురళి చంటిబాబు శనివారం డిమాండ్ చేశారు. ఏ దారకొండ పంచాయతీ పరిధి గొల్లపల్లి, పెబ్బంపల్లి, తడకపల్లి గ్రామాలలో గత నెల నుంచి ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయని, నేటికీ కూలీలకు వారి ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని పేర్కొన్నారు. దీంతో కూలీలు కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నారన్నారు. చట్ట ప్రకారం ఉపాధి పనులు చేసిన 15 రోజుల్లో వారి ఖాతాల్లో కూలి డబ్బులు జామ కావాల్సి ఉండగా, నేటికీ 40 రోజులు గడుస్తున్నా జమ చేయాలని తెలిపారు. తక్షణమే ఎన్ఆర్ఇజిఎస్ అధికారులు స్పందించి పెండింగ్లో ఉన్న పేమెంట్ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏ దారకొండ పంచాయతీ పీసా కార్యదర్శి పండన్న మాట్లాడుతూ ఒక కుటుంబానికి 200 రోజులు పనిని కల్పించాలని, రోజు వేతనం రూ.600 ఇవ్వాలని, పని ప్రదేశాల్లో టెంట్, ఫస్ట్ ఎయిడ్ కిట్ ఏర్పాటు చేయాలని, పనిముట్లు అలవెన్స్, వేసవి అలవెన్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు లక్ష్మయ్య, సత్యారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రింతాడ పంచాయతీలో పి4 సర్వే

ప్రజాశక్తి-సీలేరు : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జీకే వీధి మండలం రింతాడ పంచాయతీ పరిధి దుచ్చెరపాలెంలో గ్రామసభ ఏర్పాటు చేసి పి4 సర్వే నిర్వహించినట్లు రింతాడ పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్ తెలిపారు. పేదరికం లేని సమాజం కొరకు సర్వే నిర్వహించడం జరిగిందని చెప్పారు. సర్వేలో ఏమైనా అభ్యంతరం ఉంటే ప్రజలు గ్రామసభలో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచి, ఎంపీటీసీ, వార్డు సభ్యులు, సచివాలయ, వెలుగు సిబ్బంది, అంగన్వాడి, ఆశా కార్యకర్తలు, ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రిటైల్ సేల్స్ అసోసియేట్ కోర్సులో శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రంపచోడవరం : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్కిల్ హబ్‌లో రిటైల్ సేల్స్ అసోసియేట్ కోర్సులో శిక్షణకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 21 నుండి 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ పి.రోహిణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. 90 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. వివరాలకు రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లేదా, 6281618037 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

నేడు కళాకారులకు జిల్లా స్థాయి అవార్డులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం కళాకారుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం రైల్వే న్యూ కాలనీలోని సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమంలో విశాఖ జిల్లాలో అత్యంత ప్రతిభ కనబరిచిన కళాకారులను కళా ప్రవీణ 2025 పురస్కారాలతో సత్కరించనున్నట్టు సంఘం గౌరవాధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షులు కె.జనార్ధన్ తెలిపారు. శనివారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు ఆ వివరాలను వెల్లడించారు. విశాఖ జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కళాకారులను ఎంపిక చేసి ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నట్టు తెలిపారు. విభిన్న కళా రంగాలకు చెందిన కళాకారులు సుమారు 2000 మంది ఈ సంఘంలో సభ్యులుగా ఉన్నారన్నారు. కళాకారుల్లో ఐక్యతను పెంపొందించేందుకు చేపడుతున్న కార్యక్రమాలను తెలియజేశారు. మీడియా సమావేశంలో ఇంటర్నేషనల్ కొరియోగ్రాఫర్ ఆర్.నాగరాజ్ పట్నాయక్, సినీ డైరెక్టర్ యాదకుమార్, నంది అవార్డు గ్రహీత ఎం.శివజ్యోతి, ఈటివి పాడుతా తీయగా ఫేమ్ కీబోర్డ్ ప్లేయర్ మనోహర్ ప్రసాద్, ధనుంజయ పట్నాయక్, కె.రమణారావు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ శిక్షణా శిబిరానికి ఐదుగురు విద్యార్థులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 24 నుంచి 28 వరకు భువనేశ్వర్‌లో తలపెట్టిన రాష్ట్ర స్థాయి స్టడీ జూనియర్ రెడ్ క్రాస్ ట్రైనింగ్ క్యాంపునకు విశాఖపట్నం జిల్లా శ్రీ శారద విద్యా నిలయం స్కూల్‌కు చెందిన జూనియర్ రెడ్ క్రాస్ విద్యార్థులు ఐదుగురు ఎంపికయ్యారు. వారిని విశాఖపట్నం రెడ్ క్రాస్ శాఖ ద్వారా అక్కడకు పంపనున్నారు. దీనిలో భాగంగా శనివారం శ్రీ శారద విద్యాలయం స్కూల్ ప్రిన్సిపాల్ పీడీ ఎల్ఎన్.శ్రీనివాసరావు, రెడ్ క్రాస్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ పి.రవికుమార్ (జెఆర్‌సి), వైఆర్‌సి కో-ఆర్డినేటర్ ఎమ్‌డి రెహంతుల్లా, డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ సంతోష్ రెడ్ క్రాస్ జెండా ఊపి అభినందనలు తెలుపుతూ పంపించారు.

ఎవరి మేలుకోరి ఈ మౌనం..!

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

కూటమి ప్రజా ప్రతినిధుల కళ్లకు కనబడకుండా ఏ పొరలు అడ్డుపడుతున్నాయో తెలీదుగానీ ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో జరుగుతున్న ఏ వినాశ సృష్టిపైనా నోరు విప్పడంలేదు. ఎన్నికల ముందు గెలవడానికి చెప్పిన కబుర్లు, ఇచ్చిన మాటలేవీ వారికి గుర్తున్నట్లులేవు. ప్రజలు గుణపాఠం చెప్పే వరకు వీరు గుర్తెరిగేలా లేరు. ఓటమితో వైసిపి చతికలపడింది. ఆవహించిన అధికార మదంతో కూటమి వాస్తవం గుర్తించ నిరాకరిస్తోంది. గెలిపించిన ప్రజలకు కీడు తప్ప మేలు చేసే మాటలు వారినోటి నుంచి ఈ కాలంలో రాలేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను తగలబెట్టడానికి మోడీ ప్రభుత్వం పెట్టిన నిప్పుతో కాల్చుకోవడానికి జిల్లా కూటమి ప్రజా ప్రతినిధులు సిద్ధపడుతున్నారేగానీ ఆ ముప్పును ఎదుర్కొనే సాహసం చేయడంలేదు. స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా జరుగుతున్న కార్మికులు, ఉద్యోగుల పోరాటానికి బహిరంగ సంఘీభావం ప్రకటించి గనుల సాధన, సెయిల్‌లో విలీన ప్రకటన వెలువడే వరకు మీ వెంట మేముంటామని నిలబడ్డానికి వారికి వెన్నుముక వున్నట్లు లేదు. స్టీల్‌ప్లాంట్‌లో వేలాది మంది కాంట్రాక్టు కార్మికుల తొలగింపును అడ్డుకోకుండా ఏ గుడ్డి గుర్రానికో పళ్లు తోమడానికి టిడిపి, జనసేన, బిజెపి ఎమ్మెల్యేలు, ఎంపీలు వెళ్లారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పదవుల ఆశలో కార్మికులను వదిలి విన్యాసాలు చేస్తే వారు మౌనందాల్చరు. కుటుంబాలన్నీ తిరగబడతాయి. ఆ విషయాన్ని గుర్తెరగాలి. స్టీల్‌ప్లాంట్‌పై పిల్లి మొగ్గలు వేసినట్లే... గ్రామీణ ప్రాంతంలో క్రషింగ్ నిలిపివేసిన తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సహకార సుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణపైనా ప్రజాప్రతినిధులు కప్పు గెంతులు వేస్తున్నారు. తిరిగి క్రషింగ్ జరిగేలా తామంతా కలిసి కృషి చేస్తామని ఎమ్మెల్యేలెవరూ చెప్పడంలేదు. జనసేనలో చేరిక తరువాత ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ స్వర శబ్దం బలహీనపడింది. ఉత్తరాంధ్రకు జరుగుతున్న అన్యాయంపై గట్టిగా నోరువిప్పడం మానేశారు. గోవాడ సహకార సుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరిస్తామన్న మాట మర్చిపోయారు. రోజుకు నాలుగువేల టన్నుల క్రషింగ్ సామర్థ్యం కలిగిన గోవాడ ఫ్యాక్టరీ, ఈ ఏడాది సగటున 1500 టన్నులకు మించి ఆడ్డంలేదు. చెరుకు సరఫరా చేసిన రైతుకు బిల్లులు, కంపెనీ కార్మికులకు జీతం చెల్లించలేదు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ పోరాట కమిటీ నేతృత్వంలో బకాయిలు చెల్లించాలని, ఫ్యాక్టరీ ఆధునికీకరణకు రూ.350 కోట్లు విడుదల చేయాలని రైతులు ఫ్యాక్టరీ ఎదుట ధర్నా చేపట్టారు. బకాయిలు ఇవ్వకపోతే ఈ పోరాటం విస్తృతం కానుంది. తన పొలంలోనే చెరుకు పంటకు నిప్పు పెట్టుకున్న పరిస్థితి దేవరాపల్లి రైతుకు ఎందుకొచ్చిందని ఎమ్మెల్యేలు ఆలోచిస్తే కనీసం జవాబైనా దొరుకుతుంది.

కాకినాడ తీర ప్రాంతంలో ప్రజలు ప్రతిఘటించిన బల్క్ డ్రగ్ పార్కును నక్కపల్లిలో ఏర్పాటుచేయనారంభించినా, అనకాపల్లి జిల్లా తీరంలో అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుపైనా వారెవరూ మాట్లాడటం లేదు. నాతవరం మండలంలో లేటరైట్ అక్రమంగా తవ్వుకుపోతున్నా నోరు విప్పడం లేదు. నీటిపారుదల ప్రాజెక్టులకు సరిపడా నిధులు కేటాయించకపోయినా ప్రభుత్వంపై ఒత్తిడి చేయడం లేదు. కాలుష్యంతో ప్రజలు బాధలు పడుతున్నా పట్టించుకోవడం లేదు. పరిశ్రమల్లో స్థానిక యువతకు విద్యార్హతలకు తగిన ఉపాధి కల్పించకపోయినా కలుగజేసుకోవడం లేదు. తాండవ, రైవాడ జలాశయ నీటి వనరులపై అదానీ, షిర్డీ సాయి కంపెనీలు ఏజెన్సీలో హైడల్ పవర్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు సిద్ధపడుతున్నా వ్యతిరేకించడం లేదు. కూటమి ప్రజా ప్రతినిధులు ఎవరికి ప్రాతినిధ్యం వహిస్తున్నారో, ఎవరి ప్రయోజనాలను కాపాడుతున్నారో ఇప్పటికే ప్రజలకు అర్థమైవుండాలి. స్వర్ణాంధ్రప్రదేశ్ స్వప్నంలో ప్రభుత్వం విస్మరిస్తున్న ప్రజా సమస్యలు సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో వెలుగులోకి వస్తున్నాయి. ఈ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ప్రజలు పోరాట మార్గాలను ఎంచుకుంటారు.

నాలుగేళ్ల క్రితం హత్య కేసు ఛేదన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో నాలుగేళ్ల క్రితం సంచలనం సృష్టించిన రౌడీ షీటర్ హత్య కేసును కంచరపాలెం పోలీసులు ఛేధించారు. దీనికి సంబంధించి విశాఖ నగర పోలీసు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కేసు వివరాలను నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. 2021 ఏప్రిల్ 22న కంచరపాలెం మెట్టు, పైడిమాంబ గుడి సమీపంలో ఒక వ్యక్తి మర్మాంగాన్ని కోసి, దారుణంగా హత్య చేశారు. అతని మృతదేహాన్ని సర్వీస్ రోడ్డులో పడేశారు. కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు గనగళ్ల శ్రీనుగా గుర్తించారు. అతని అన్న కుమారుడు గనగళ్ల ధనరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ సాగించారు. చాలా కాలం కేసులో ఎటువంటి పురోగతీ లేనందున కేసును అన్ డిటెక్టబుల్‌గా ట్రీట్ చేస్తూ ఆగస్టు 2022లో క్లోజ్ చేశారు.

ఆ తరువాత మూసివేసిన కేసులను ఒకటి తర్వాత ఒకటి డిటెక్ట్ చేయాలనే నిర్ణయంపై మొదటి ప్రయత్నంగా మూడు సంవత్సరాలు క్రితం మూసివేయబడిన కంచరపాలెం పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన హత్య కేసును తెరిచారు. సిఐ షేక్ హుస్సేన్ నాయకత్వంలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం ఈ కేసులో విచారణ జరిపింది. అనకాపల్లికి చెందిన లాలం గణేష్, పెద గంట్యాడకు చెందిన తారకేశ్వరరావు పాతకక్షల నేపథ్యంలో ఈ హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. దీంతో నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులను సిపి అభినందించారు.

మరోసారి పోలీసు బదిలీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మరోసారి పలువురు పోలీస్ సిబ్బందిని బదిలీ చేస్తూ సిపి శంఖబ్రత బాగ్చి శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో నాలుగో పట్టణ క్రైమ్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.సత్యారావు ఉన్నారు. ఆయనను ఆనందపురం క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. భీమిలి లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎం.సింహాచలంను ఆనందపురం లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

ఉక్కు రక్షణ నినాదాలు చేస్తున్న నాయకులు

ఉక్కు కార్మికుల తొలగింపును రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని రక్షించేందుకు ప్యాకేజీ తెచ్చామని ఊదరగొట్టు ఉపన్యాసాలు చేస్తున్న టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌లోని కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికుల అక్రమ తొలగింపులను అడ్డుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. ఉక్కు పరిరక్షణ పోరాటంలో భాగంగా విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి పిలుపు మేరకు లక్ష కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తూ మద్దిలపాలెం సిఐటియు జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శనివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉక్కు పరిరక్షణ నినాదాలు చేశారు. అక్కడి వారందరికీ కరపత్రాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్యాకేజీగా వచ్చిన డబ్బుల్లో ఒక్క రూపాయి కూడా కార్మికుల ప్రయోజనాలకు, ఉత్పత్తికి ఖర్చు చేయలేదన్నారు. ఇలా అయితే ఏ రకంగా లాభాలొస్తాయని ప్రశ్నించారు. చాపకింద నీరులా కాంట్రాక్ట్ కార్మికులను 4500 మందిని, పర్మినెంట్ కార్మికులను మరో 2500 మంది తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. కార్మికులను క్రమేపీ తగ్గించి నష్టాలు చూపి ప్రైవేట్‌వారికి ప్లాంట్‌ను కట్టబెట్టాలనే కుట్ర సాగుతోందన్నారు. పోరాటాలతో దాన్ని తిప్పికొడతామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జోన్ కార్యదర్శి పి.వెంకటరావు, ఉపాధ్యక్షులు కె.కుమారి, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.కృష్ణారావు, తోపుడుబండ్లు సంఘం నాయకులు ఎ.సింహాచలం, ఎ.అప్పారావు, రమేష్, శ్రీను, సిఐటియు సీనియర్ నాయకులు జి.పోలేశ్వరరావు పాల్గొన్నారు.

గిరిజనేతరులకు ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : 5వ షెడ్యూల్డ్ ప్రాంతమైన కొయ్యూరు మండలం, బంగారంపేటలోని సర్వే నెంబర్ 90లో 14 ఎకరాల 31 సెంట్లు భూమికి గిరిజనేతరులకు ఇచ్చిన పట్టాలను తక్షణమే రద్దు చేయాలని ఆదివాసీ జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. గ్రామంలో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 5వ షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉన్న 14 ఎకరాల 31 సెంట్లు భూమిని దుళ్ళా శ్రీనివాసరావు, దలే కావమ్మ అనే గిరిజనేతరులకు వెబ్ ల్యాండ్‌లో నమోదు చేసి (1-బి) 2025 జనవరి 24న కొయ్యూరు మండల రెవెన్యూ అధికారులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఆదివాసీ అయిన మాదల తిరుపతయ్య పేరున ఉన్న భూమిని నర్సీపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గిరిజనేతరుల పేరున రిజిస్ట్రేషన్ చేయడం దారుణమన్నారు. ఆదివాసీ చట్టాలపై కనీస అవగాహన లేకుండా రెవెన్యూ అధికారులు గిరిజనేతరులకు పట్టాలు ఎలా ఇచ్చారని, వెబ్ ల్యాండ్‌లో ఎలా నమోదు చేశారని ప్రశ్నించారు. తక్షణమే ఇచ్చిన పట్టాలు రద్దు చేయాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని, భూ బదలాయింపు నిషేధచట్టం ఉల్లంఘన కింద కోర్టులో కేసు వేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు ఎస్.అశోక్ లాల్, పాడి లోవరాజు, ఉల్లి సూరిబాబు. నర్సికృష్ణ, కాకర చిన్నారావు, కాకర సోమినాయుడు, కొర్రు బాబూరావు, వంజరి సంకురమ్మ, బూరుగు వెంకటరావు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలకు పెద్దపీట

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలకు పెద్దపీట వేయాలని, తరుచూ మాక్ డ్రిల్స్ నిర్వహించి కార్మికులను, ప్రజలను అప్రమత్తం చేయాలని సంబంధిత అధికారులను, పరిశ్రమల నిర్వాహకులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో శనివారం వివిధ విభాగాల అధికారులు, పరిశ్రమల నిర్వాహకులతో కూడిన జిల్లా క్రైసిస్ మేనేజ్‌మెంట్ గ్రూప్ మీటింగ్‌ను కలెక్టర్ నిర్వహించారు. పరిశ్రమల్లో పాటించాల్సిన భద్రతా ప్రమాణాలపై పలు మార్గదర్శకాలు జారీ చేశారు.